## సభలో గంజాయి కలకలం

నర్సాపూర్, ఫిబ్రవరి 24: నర్సాపూర్‌లో బీజేపీ సభలో గంజాయి విక్రయం కలకలం రేపింది. నర్సాపూర్ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన సభకు పెద్దసంఖ్యలో జనాలు హాజరయ్యారు. ఇదే అదునుగా భావించిన ఓ యువకుడు అక్కడకు వచ్చినవారికి గంజాయి విక్రయిస్తుండగా గమనించిన స్థానికులు అతడిని పట్టుకుని కొట్టి, పోలీసులకు అప్పగించారు.



పోలీసుల అదుపులోని గంజాయి నిందితుడు

# గంగమ్మ.. పాతాళానికి!



- నెల వ్యవధిలో 2 మీటర్లు కిందికి భూగర్భ జలాలు
- గత డిసెంబరులో 9.86 మీటర్ల లోతులో..
- జనవరి చివరకు 11.46 మీటర్ల లోతుకు క్షీణత
- మెదక్ జిల్లాలో భారీగా తగ్గిన యాసంగి సాగు
- లక్ష ఎకరాల్లో పంటలకు విరామం



మెదక్, ఫిబ్రవరి 24 : మెతుకుసీమలో పంటల సాగు గణనీయంగా తగ్గింది. ఈ యాసంగిలో లక్ష ఎకరాల్లో రైతులు పంటలకు విరామం ఇచ్చారు. జిల్లాలో వ్యవసాయానికి ప్రధాన ఆధారమైన భూగర్భ జలాలు తగ్గిపోవడం సైద్యంపై ప్రభావం చూపింది. జిల్లాలో సాగు విస్తీర్ణంలో ఎక్కువగా భూగర్భ జలాలపై ఆధారపడి ఉంటుంది. జిల్లా మొత్తంలో ఒక్కటే మధ్య తరహా ప్రాజెక్టు ఉండగా ఆయకట్టు రెండుమూడు మండలాలకే పరిమితమయింది. మిగిలిన మండలాల్లో యాసంగి సాగు పూర్తిగా బోర్లపై ఆధారపడి సాగు చేస్తారు. ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోవైపు భూగర్భ జలాలు తగ్గిపోతున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. నెల రోజుల్లోనే దాదాపు రెండు మీటర్ల వరకు భూగర్భ జలాలు క్షీణించాయి. 2023 డిసెంబరు నెలలో జిల్లాలో భూగర్భ జలాలు సగటున 9.86 మీటర్ల లోతులో ఉండగా.. 2024 జనవరి వరకు 11.46 మీటర్లకు తగ్గిపోయాయి. గత సంవత్సరం జనవరిలో 10 మీటర్ల వద్ద భూగర్భ జలాలు లభ్యమయ్యేవి. గడచిన వర్షాకాలంలో జిల్లాలో వర్షాలు సాధారణ స్థాయిలోనే కురియడంతో భూగర్భ జలాలు వేగంగా రీచార్జి కాలేదని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### జిల్లాలో 60 వేల బోర్లు

మెదక్ జిల్లాలో 3,97,480 ఎకరాల సాగు భూమి ఉన్నది. ఇందులో సుమారు 70 శాతం రైతులు బోరుబావుల పైనే ఆధారపడి వ్యవసాయం చేస్తారు. జిల్లాలో ఏకైక మధ్య తరహా ప్రాజెక్ట్ వనదుర్గా జలాశయం (ఘణపురం ఆనకట్ట) ఉంది. దీని కింద పాపన్నపేట, కొల్చారం, హవేళిఘణపూర్, మెదక్ మండలాల పరిధిలో 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ, కాల్వలు దెబ్బతినడం, గుర్రపుడెక్కతో నిండిపోవడంతో చివరి ఆయకట్టుకు పంట పొలాలకు నీరందడం లేదు. మెదక్, రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, హవేళీఘణపూర్, తూప్రాన్, టేక్మాల్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, నర్సాపూర్, శివ్వంపేట, వెల్దుర్తి, రేగోడ్, చేగుంట మండలాల్లో రైతులు బోర్ల ఆధారంగా పంటలు సాగు చేస్తారు. జిల్లాలో 60 వేల వరకూ బోర్లు ఉన్నాయి. భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుతుండడంతో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఈ యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గించారు. 2022-23 యాసంగిలో 2,71,058 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ప్రస్తుత యాసంగిలో మాత్రం 1,95,763 ఎకరాల విస్తీర్ణంలోనే పంటలు వేశారు. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే దాదాపు లక్ష ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది. చివరి వరకు నీరందుతుందనే నమ్మకం లేకపోవడంతో పంటలు వేయకుండా విరామం పాటిస్తున్నారు.

**పంటల సాగు వివరాలు**

| యాసంగి పంటలు | 2022-23 (ఎకరాల్లో) | 2023-24 యాసంగి (ఎకరాల్లో) |
|---|---|---|
| 1. వరి | 2,60,341 | 1,85,295 |
| 2. జొన్న | 5,997 | 7,318 |
| 3. మొక్కజొన్న | 3,368 | 2,426 |
| 4. పెసలు | 866 | 268 |
| 5. వేరుశనగ | 121 | 89 |
| 6. సన్‌ఫ్లవర్ | 353 | 360 |
| 7.ఇతర పంటలు | 12 | 7 |
| మొత్తం | 2,71,058 ఎకరాలు | 1,95,763 ఎకరాలు |



### ఆరుతడి పంటలే సాగుచేయండి



ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటల విస్తీర్ణం తగ్గింది. ఈ సంవత్సరం వేసవి ప్రభావం కనిపిస్తున్నది. జిల్లాలో సరాసరి నీటిమట్టం 11.46 మీటర్ల లోతుకు పడిపోవడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వరి సాగుకు బదులు నీరు తక్కువగా అవసరమయ్యే ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి.

-వెంకటేశ్వర్లు,
మెదక్ జిల్లా భూగర్భజల అధికారి

# ప్రజల కోసం పనిచేసే పార్టీ బీజేపీ



నర్సాపూర్‌లో విజయ సంకల్ప యాత్రలో పురుషోత్తంరూపాల, రఘునందన్‌రావు తదితరులు

- దేశంలో మిగిలినవన్నీ కుటుంబ పార్టీలే
- తెలంగాణలో అత్యధిక ఎంపీలను గెలిపించాలి
- కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలా

నర్సాపూర్, ఫిబ్రవరి 24: దేశంలో బీజేపీ ఒక్కటే ప్రజల కోసం పనిచేస్తుందని.. మిగతా పార్టీలన్నీ కుటుంబ పార్టీలేనని కేంద్ర పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తంరూపాలా పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా సంకల్పయాత్ర శనివారం సాయంత్రం నర్సాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చిన అనంతరం దేశంలో అత్యధిక కాలం కాంగ్రెస్ అధికారంలో ఉన్నా నెహ్రూ కుటుంబానికి చెందినవారే ఎక్కువ మంది ప్రధానులయ్యారని, పార్టీకి చెందిన ఇతరులు అధికారంలో ఉన్నా ఆ కుటుంబమే పెత్తనం సాగించిందని విమర్శించారు. నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తున్నదని పేర్కొన్నారు. భారత్ అన్నిరంగాల్లో ప్రపంచంలోనే అగ్రభాగానికి దూసుకుపోతున్నదని కొనియాడారు. నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిని చేయడానికి తెలంగాణలో అత్యధిక స్థానాలు గెలిపించాలని పిలుపునిచ్చారు.

### అరచేతిలో వైకుంఠం చూపించారు

ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు ఇప్పుడు మొండి చేయి చూపిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో 14 సీట్లు ఇస్తేనే ఆరు గ్యారంటీలను అమలు చేయగలుగుతామని అంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ వచ్చిన అనంతరం పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రజలకిచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మాటలతోనే కాలం గడిపిందని ఎద్దేవా చేశారు. పదేళ్లలో నర్సాపూర్‌లో ఒక్క నిరుపేదకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. ధరణి పేరిట చేసిన అక్రమాలకు గతంలో మెదక్ జిల్లాలో పనిచేసి అధికారి జైలుకు కూడా వెళ్లారని గుర్తుచేశారు. మెదక్ ఎంపీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి మురళీధర్‌యాదవ్ మాట్లాడుతూ మెదక్-హైదరాబాద్ రహదారిపై డివైడర్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రఘునందన్ రావు, యెండల లక్ష్మీనారాయణ, నాయకులు రఘువీరారెడ్డి, ప్రణీత, బస్వరాజ్ లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేష్‌గౌడ్, నియోజకవర్గ నాయకులు వి.మల్లేశ్‌గౌడ్, సతీష్‌యాదవ్, కౌన్సిలర్లు బుచ్చేస్‌యాదవ్, సురేష్, యాదగిరి, లతరమేష్‌యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

### మూడోసారీ బీజేపీ ప్రభుత్వమే

హత్నూర : ప్రపంచం గర్వించదగ్గ స్థాయిలో భారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కేంద్రంలోని బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోదీకి ముచ్చటగా మూడోసారి అధికారం కట్టబెట్టేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో కేంద్రమంత్రి మాట్లాడారు. మెదక్ ఎంపీగా బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.





# అవిశ్వాసానికి సై.. ఎన్నికకు నై!

రసవత్తరంగా సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

జగ్గారెడ్డి, హన్మంతరావు హెచ్చరికలతో వెనక్కి తగ్గిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

22 మంది నుంచి 18 మందికి తగ్గిన అసమ్మతి కౌన్సిలర్ల బలం

బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లల్లో చీలిక!

సదాశివపేట, ఫిబ్రవరి 24 : సదాశివపేట మున్సిపాలిటీలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. పార్టీలకతీతంగా ఏకమై మున్సిపల్ చైర్పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి దించేసిన కౌన్సిలర్లు.. కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు వచ్చేసరికి మాట మారుస్తున్నారు. సదాశివపేట బల్దియా కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక మార్చి 4వ తేదీన నిర్వహించనున్నట్టు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. బల్దియాలో మొత్తం 26 మంది కౌన్సిలర్లలో 22 మంది ఫిబ్రవరి 9న జరిగిన అవిశ్వాసానికి మద్దతు పలకడంతో బీఆర్ఎస్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ పదవిని కోల్పోయారు. కానీ, కొత్త చైర్పర్సన్ ఎన్నిక మాత్రం అంత సులభంగా జరిగే పరిస్థితి కనిపించడం లేదు. మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హెచ్చరికతో అవిశ్వాసానికి అండగా నిలిచిన నలుగురు కౌన్సిలర్లు మాట మార్చినట్టు తెలుస్తున్నది. ఈమేరకు చైర్పర్సన్ సీటుపై గురిపెట్టి భారీ ఖర్చుతో క్యాంపు రాజకీయాలు నడుపుతున్న నాయకుడికి షాక్ ఇచ్చినట్టు సమాచారం. దీంతో అసమ్మతి క్యాంపులో 18 మంది కౌన్సిలర్లే ఉన్నారు. కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు కూడా సదాశివపేట బల్దియా చైర్‌పర్సన్ ఎన్నికపై నజర్ పెట్టడంతో ఇప్పుడు క్యాంప్ రాజకీయం చేస్తున్న నాయకుడు డైలామాలో పడ్డారు. పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లను ప్రసన్నం చేసుకుని ఎలాగైనా తన సతీమణిని చైర్‌పర్సన్ పీఠంపై కూర్చోబెట్టాలని అనుకుంటున్న ఆయన అధికార పార్టీలోని పెద్ద నాయకుల జోక్యంతో పునరాలోచనలో పడినట్టు సమాచారం. బీఆర్ఎస్ చీలికవర్గంలోని కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరితేనే చైర్‌పర్సన్ ఎన్నికకు సహకరిస్తామని ఆ నేతలు తెలిపినట్టు సమాచారం. ఇదే జరిగితే చైర్‌పర్సన్ రేసులో కొత్త అభ్యర్థి నిలవడం ఖాయమని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. మరోవైపు అసమ్మతి నాయకుడికే బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతు ఇప్పించి బల్దియా పీఠం బీఆర్ఎస్ చేయి దాటనీయ వద్దని చూస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కూడా ప్రస్తుత పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

### మూడేళ్ల బాలికను పొలంలో ముంచి..

# చంపిన మేనమామ

- మతిస్థిమితం లేక దారుణం
- చితకబాదిన గ్రామస్థులు

నంగునూరు, ఫిబ్రవరి 24: మతిస్థిమితం లేని మేనమామ తన మేనకోడల్ని బురద పొలంలో ముంచి చంపిన సంఘటన శనివారం నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన గుజరాతి సంతోష, రాజు దంపతులు. వారికి కుమార్తె శిరీష(3) ఉంది. వారు నంగునూరు మండలం బద్దిపడగ గ్రామానికి వచ్చి వేముల శశిధర్‌రెడ్డికి చెందిన మామిడి తోట లీజుకు తీసుకొని అందులోనే నివాసం ఉంటున్నారు. వీరితో పాటే సంతోష అన్న శ్రీను ఉంటున్నాడు. మతిస్థిమితం లేని శ్రీను శనివారం తోట సమీపంలో ఉన్న పొలంలోని వరిని ధ్వంసం చేశాడు. మామ చేస్తున్న పిచ్చి పనులను శిరీష అక్కడే నిల్చుని చూస్తున్నది. శ్రీను శిరీష వద్దకు వెళ్తుండగా తప్పించుకునేందుకు బాలిక కేకలు పెడుతూ పరుగెత్తింది. వెంటాడిన శ్రీను చిన్నారిని పట్టుకొని పక్కనే వరి నాట్లు వేసిన బురద పొలంలో ముంచాడు. శిరీష కేకలు విన్న తల్లిదండ్రులు పరుగెత్తుకుంటూ వెళ్లి శిరీషను బురదలో నుంచి బయటకు తీయగా.. అప్పటికే చిన్నారి మృతి చెందడంతో గుండెలవిసేలా ఏడ్చారు. ఘటన గురించి తెలుసుకున్న చుట్టుపక్కల వారు పారిపోతున్న శ్రీనును పట్టుకొని చితకబాదారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని, బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజగోపాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




నిందితుడు శీను



మేనమామ చేతిలో మృతి చెందిన శిరీష



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ విత్తనాలు



### రూ. 35 లక్షల విలువైన 1,450 కిలోల

# నాసిరకం పత్తి విత్తనాలు పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 24 : హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో అక్రమంగా నిలువ చేసిన 1,450 కిలోల నాసిరకం పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. హుస్నాబాద్ ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... మహ్మదాపూర్ గ్రామంలో నాసిరకం పత్తి విత్తనాలను నిల్వ చేశారనే సమాచారం మేరకు శుక్రవారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు, హుస్నాబాద్ పోలీసులు గ్రామంలోని ముక్కెర మల్లయ్య ఇంట్లో దాడులు నిర్వహించారు. 50 కేజీల చొప్పున కంపెనీ పేరు లేకుండా 29 బ్యాగులను నిల్వ చేసినట్లు గుర్తించారు. వరంగల్ జిల్లా వేలేరు గ్రామానికి చెందిన పిండి సురేష్, కరంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లికి చెందిన సతీష్ హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలతో పాటు ఇతర జిల్లాల్లో రైతులకు నాసిరకం పత్తి విత్తనాలు విక్రయించేందుకు వీటిని నిల్వ చేసినట్లు విచారణలో తేలింది. అందులో భాగంగానే సతీష్ అమ్మగారైన మహ్మదాపూర్‌లోని ముక్కెర మల్లయ్య ఇంట్లో వీటిని నిల్వ చేశారు. దీంతో ఇంటిపై దాడిచేసి పిండి సురేష్, సతీష్‌పై కేసు నమోదు చేశారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే సిద్దిపేట జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల ఫోన్ నంబర్ 8712667447, 8712666446కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ మహేష్ కోరారు.



# ఏడుపాయల జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24: ఏడుపాయల జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. వచ్చే నెల 8 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతర ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది జాతరకు గతం కంటే ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి లోటు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. పని విభజన చేసుకుని రోజూ మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించాలని సూచించారు. వాహనాలు, బైక్‌లకు పాసుల జారీ, పార్కింగ్‌ని హేతబద్ధీకరించడం ద్వారా జాతరలో చాలా సమస్యలు అధిగమించవచ్చని సూచించారు. బారికేడింగ్, ఫెక్సీల ఏర్పాటు, పారిశుధ్య పనులు, షవర్లు, మంచినీటి కుళాయిలు, శౌచాలయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విరివిగా బస్సులు నడపాలని, గజ ఈతగాళ్ళ, వైద్య ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాసులు, ఎంపీడీవో, స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

### 'కేతకీ' జాతర ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష

ఝరాసంగం, ఫిబ్రవరి 24 : దక్షిణకాశీగా పేరెన్నికగల సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి జాతర, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని జహీరాబాద్ ఆర్డీవో రాజు అధికారులకు పిలుపునిచ్చారు. జాతర ఏర్పాట్లపై ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో శనివారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, తమ శాఖల పరిధిలో చేపట్టిల్సిన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, సదుపాయాల కల్పనపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలను అందంగా అలంకరించాలని నిర్దేశించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రహోత్సవాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వినీలానరేష్, ఎంపీపీ దేవదాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్, ఆలయ మాజీ చైర్మన్ వెంకటేశం, తహసీల్దార్ సంజీవ రావు, ఎంపీడీవో సుధాకర్, ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి, ఏడీఏ భిక్షపతి, ఈవో శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు డీఏవీ విద్యార్థుల ఎంపిక

తాండూరురూరల్, ఫిబ్రవరి 24 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తాండూరు మండలంలోని కరన్‌కోట్ సీసీఐ డీఏవీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏసురత్నం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న తాండూరులోని పాత శాలివాహన డిగ్రీ కళాశాలలో అండర్-17, 16, 14 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలు జరుగగా పాఠశాలకు చెందిన విద్యార్థులు కరణ్‌జాదవ్‌ఓవి, సరితకుమారి, గాయత్రి రన్నింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదివారం (ఈ నెల 25) నుంచి హైదరాబాద్ కొల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ చైర్మన్, జీఎం మహాన, ఆర్వో శేషాద్రి, పీఈటీ మహాదేవ్ అభినందించారు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

## ధ్రువపత్రాలన్నీ ఉంటేనే దరఖాస్తులు స్వీకరించాలి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న మీ-సేవ ఆపరేటర్లు

కోహీర్ ఫిబ్రవరి 24: కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాల కోసం మీ-సేవకు వచ్చే అర్జీదారుల వద్ద అన్ని పత్రాలు ఉండాలని, అలా ఉంటేనే మీసేవ-ఆపరేటర్లు దరఖాస్తులు స్వీకరించి మీ-సేవ పోర్టల్‌లో పొందుపరచాలని కోహీర్ మండల తహసీల్దార్ బాలశంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కోహీర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల మీసేవ-ఆపరేటర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసే వారి సంతకాలు అప్లికేషన్ ఫారాలపైన కచ్చితంగా ఉండాలన్నారు. భూ-రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్లాట్ బుకింగ్ విషయంలో కూడా మీ-సేవ ఆపరేటర్లు జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలన్నారు. దరఖాస్తు చేయడంలో పొరపాట్లు జరిగితే మీ-సేవ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఇటీవల కల్హేర్ మండలం నుంచి కోహీర్ మండల తాహసీల్దారుగా బదిలీపై వచ్చిన బాలశంకర్‌ను మీ-సేవ ఆపరేటర్లు శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ సివో అయ్యూబ్, మీ-సేవ ఆపరేటర్లు మల్లేశం, ముజాహిద్, సాగర్, అజీమ్, మతీన్ తదితరులు ఉన్నారు.

# సంగారెడ్డి అభివృద్ధిని విస్మరించిన నాయకులు

- కేంద్రంలో మూడోసారి అధికారం మాదే..
- మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సంగారెడ్డి టౌన్/పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 24 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి అభివృద్ధిని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పూర్తిగా విస్మరించారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్ రావు, మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణలు ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజరాజేశ్వరి విజయ సంకల్ప యాత్ర శనివారం సంగారెడ్డిలో కొనసాగింది. సంగారెడ్డిలోని పాత బస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందు రుద్రారం సమీపంలోని గణేష్ గడ్డ నుంచి అల్మాయిపేట, కంది, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీతో బస్సుయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీష్ రావు సిద్దిపేటను అభివృద్ధి చేసి సంగారెడ్డిని విస్మరించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలను బహిష్కరించానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అందుబాటులో ఉండని జగ్గారెడ్డిని ప్రజలే బహిష్కరించారన్నారు. జగ్గారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డితో ఏ మాత్రం సఖ్యత ఉన్నా సంగారెడ్డి వరకు మెట్రోను తెప్పించాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 80 రోజులైనా ఒక్కసారైనా జగ్గారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారా అని ఎద్దేవాచేశారు. బీజేపీని తిట్టడమే జగ్గారెడ్డి పనిగా పెట్టుకున్నారని దయ్యబట్టారు. గతంలో సంగారెడ్డి గడ్డ మీద బీజేపీ గెలిచిన చరిత్ర మళ్లీ పునరావృతం కానున్నదన్నారు. తాము అధికారంలోకి వస్తే 100రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కేవలం దరఖాస్తుల సేకరణతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టబోతుందన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. 500 సంవత్సరాల పోరాటాల ఫలితంగా లక్షలాది మంది ప్రాణ త్యాగాలతో అయోధ్యలో రామమందిరం నిర్మించి కోట్లాది ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి నరేంద్ర మోదీకి బహుమానంగా అందిస్తామన్నారు. ఈ యాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ నేతలు సంగప్ప, ఆదెళ్ల రవీందర్, పులిమామిడి రాజు, జగన్, రాజుగౌడ్, నాగరాజు, గురువారెడ్డి, ద్వారక రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

### లింగంపల్లి చౌరస్తాకు నిధులు

లింగంపల్లి చౌరస్తా వద్ద సిగ్నల్ లేని జంక్షన్ ఏర్పాటుకి నితిన్ గడ్కరి 890 కోట్లు మంజూరు చేశారని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు తెలిపారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపుమేరకు బీజేపీ విజయసంకల్ప యాత్రను శనివారం ముత్తంగి వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ.. చర్లపల్లి, ఈదుల నాగులపల్లె రైల్వే టెర్మినల్స్ ఏర్పాటుకు కేంద్రం ప్రతిపాదించగా చర్లపల్లి టెర్మినల్ పూర్తయిందని ఈదుల నాగులపల్లి టెర్మినల్ మాత్రం భూసేకరణ వద్ద నిలిచిపోవడం స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యానికి అది నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ నేతలు హైదరాబాదును సిగ్నల్ లేని హైదరాబాద్‌గా రూపొందించామని ప్రగల్భాలు పలికారని కానీ, వారికి లింగంపల్లి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. పటాన్‌చెరులో ప్రభుత్వ భూములున్నా ఐటీ సెజ్‌ను డెవలమ్‌మెంట్ చేయలేదని బీఆర్ఎస్ పార్టీకి ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణలో మెజార్టీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. అనంతరం రుద్రారం గణేష్ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, సంగప్ప పాల్గొన్నారు.



సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాగునీటి కోసం ప్రత్యేక ప్రణాళికను తయారు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్, గ్రామాల్లో బోర్‌వెల్స్ పైపులైన్‌లు, కుళాయి మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కమలాకర్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న కేసులతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

- మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24: చిన్న కేసులతో జీవితాలను నాశనం చేసుకోవద్దని మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి పేర్కొన్నారు. వచ్చే నెల 9న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌పై శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాజీపడే కేసుల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

చిన్న శంకరంపేట ఫిబ్రవరి 24: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనివాస్ శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి బంధువుల ఊరు కోర్విపల్లికి వెళ్లాడు. శనివారం తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో గమనించగా బీరువాలోని అరతులం బంగారం, గ్రాము ముక్కుపుడక, తులం వెండి, రూ.50,000 నగదు చోరీకి గురైనట్టు గుర్తించాడు. శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 24: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేఖకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పుడు ప్రకటనలు ఇస్తూ ఒక్కో విద్యార్థి నుంచి రూ.40 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్లి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

## శివాలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం, ఫిబ్రవరి 24: జిన్నారంలో నిర్మిస్తున్న శివాలయానికి భక్తుడు 5లక్షల విరాళాన్ని అందజేశారు. శనివారం జిన్నారంలో జ్యోతిర్లింగ శివాలయం పనులకు ప్రైవేటు సంస్థ నిర్వాహకుడు సీకే.బాబు 5లక్షల చెక్కును నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, రాజేందర్‌రెడ్డి, అశోక్‌చారి, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నరేష్, శ్రీనివాస్‌యాదవ్, మంద రమేష్, శివస్వాములు శంకరయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంపల్లి ప్రైమరి స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

మునిపల్లి, ఫిబ్రవరి24: మండలంలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రుచికరమైన పిండి వంటలు, స్వీట్లు తీసుకవచ్చి అందరూ కలిసి ఆహార పండుగను జరుపుకున్నారు.

## ఆకట్టుకున్న సైన్స్ ఫేయిర్

నారాయణఖేడ్,ఫిబ్రవరి 24: ఖేడ్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం సైన్స్ ఫేర్ నిర్వహించారు. నర్సరీనుంచి ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థులు వివిధ రకాల వర్కింగ్ మోడల్స్‌ను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు సందర్శించి వాటిని వీక్షించి ప్రాజెక్టుల మోడల్, వాటి ఉపయోగాలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

## నర్సాపూర్ మార్కెట్ యార్డు కార్యదర్శిగా ప్రతాప్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 24: నర్సాపూర్ మార్కెట్ యార్డు కార్యదర్శిగా ప్రతాప్‌గౌడ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. నర్సాపూర్ మార్కెట్ యార్డు కార్యదర్శిగా ప్రస్తుతం జోగిపేట మార్కెట్ యార్డు కార్యదర్శి సునీల్ ఉన్నారు. ఆయన స్థానంలో వటిపల్లి మార్కెట్ యార్డులో అసిస్టెంటు కార్యదర్శిగా ఉన్న ప్రతాప్ గౌడ్ పదోన్నతిపై కార్యదర్శిగా నర్సాపూర్‌కు బదిలీ అయ్యారు.

## శివాజీనగర్‌లో స్పెషల్ డ్రైవ్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 24 : సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్ 23వ వార్డులో కౌన్సిలర్ కూన వనిత సంతోష్‌కుమార్ శనివారం డ్రైనేజీకి మరమ్మతులు చేయించారు. కాలనీలోని ప్రధాన రోడ్డు పై ఉన్న డ్రైనేజీ ధ్వంసమవడంతో మురుగు నీరు ప్రవహిస్తుండడంతో కాలనీవాసులు సమస్యను కౌన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే మున్సిపల్ సిబ్బందితో డ్రైనేజీకి మరమ్మతులు చేయించారు.

## గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

పుల్‌కల్, ఫిబ్రవరి 24: చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్, గంగోజిపేట గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. గంగోజిపేట గ్రామంలో రోడ్ల పనులను మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నత్తి దశరత్, సుల్తాన్‌పూర్‌లో ఎంపీటీసీ పట్లోళ్ల మాణిక్‌రెడ్డిలు హాజరై పనులను ప్రారంభించారు.

## క్రోధి నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

తూప్రాన్: తూప్రాన్ పట్టణానికి చెందిన యువ సిద్ధాంతి సోమయాజుల సాయిరాంశర్మ గణించిన క్రోధి నామ సంవత్సర పంచాంగ అవిష్కరణ శుక్రవారం స్థానిక బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ సోమయాజుల రవీంద్రశర్మ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామకృష్ణయ్య, దత్తోపాసకులు జ్యోతిసురేష్‌శర్మ పాల్గొన్నారు.

## రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం

- లీగల్ సర్వీసెస్ చైర్మన్ కె.సూరికృష్ణ



మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ చైర్మన్ సూరికృష్ణ

జహీరాబాద్, ఫిబ్రవరి 24: రాజీమార్గంతోనే కేసులు సునాయసంగా పరిష్కారమవుతాయని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్‌సర్వీసెస్ చైర్మన్ కె.సూరికృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులు, న్యాయవాదులు కలిసి కక్షిదారుల మధ్య ఒప్పందం కుదిర్చి రాజీమార్గం ద్వార ఎక్కువ కేసులను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి జి. అనుష మాట్లాడుతూ.. సాధ్యమైనంతవరకు లోక్‌అదాలత్‌ల ద్వార కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో డిఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, బార్‌అసోసియేషన్ నాయకులు సాలోమాన్, మాణెన్న, సంతోష్‌కుమార్‌సాగర్, పోలీసులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి ఈకేవైసీ తప్పనిసరి

నిజాంపేట, ఫిబ్రవరి 24: పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి డబ్బులు పడుతూ, ఏదైనా కారణాల వల్ల ఆగిపోయినట్లైతే వెంటనే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో 211 మంది రైతులు ఈకేవైసీ చేయిస్తే, పీఎం కిసాన్ నిధుల డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16వ విడత పీఎం కిసాన్ నిధుల కోసం ఈకేవైసీ చేసుకోవాలని, ముఖ్యంగా తమ మొబైల్ ద్వారా, మీసేవ లేదా సీఎస్‌సీ సెంటర్‌ను సందర్శించి బయోమెట్రిక్ విధానం ద్వారా ఈ కేవైసీ చేసుకోవచ్చన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- తపస్ జిల్లా కార్యదర్శి చల్లా లక్ష్మణ్

చేగుంట, ఫిబ్రవరి 24: ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అన్నారు. చేగుంట మండలం బోనాల పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులందరికీ మొదటి తారీఖున జీతాలు ఇవ్వాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, జీవో 317 లో నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని ఆయన కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ విడుదల చేసి, ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా సభ్యులు మల్లారెడ్డి, తిరుపతి, నరేందర్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## ముడుపులు ఇస్తేనే రిజిస్ట్రేషన్‌లు : సీపీఎం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24: భూముల రిజిస్ట్రేషన్ కోసం మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్‌లు బుక్‌చేసుకున్న ఖేడ్ డివిజన్ పరిధిలోని తహసీల్ కార్యాలయాల్లో ముడుపులు ఇస్తేనే రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారని సీపీఎం డివిజన్ కార్యదర్శి అతిమేల మాణిక్ ఆరోపించారు. నాగల్‌గిద్ద తహసీల్దార్ స్లాట్ బుక్‌చేసుకున్న రిజిస్ట్రేషన్ చేయక పోవడంతో స్లాట్ బుక్‌చేసుకున్న వారు ఆందోళనకు దిగారంటే, ఈ ప్రాంతంలో పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించవచ్చన్నారు. నియోజకవర్గంలోని అన్ని తహసీల్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. జిల్లా అధికారులువిచారణ జరిపి అవినీతిని నిర్మూలించాలన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి



డీఎల్‌పీవో అనితను సన్మానిస్తున్న కార్యదర్శులు

జిన్నారం, ఫిబ్రవరి 24: గ్రామాలలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని డీఎల్‌పీవో అనిత అన్నారు. శనివారం జిన్నారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష జరిపారు. కార్యదర్శులు వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యం పనులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు డీఎల్‌పీవోను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 2 వరకు మోడల్ స్కూల్ దరఖాస్తులు

మునిపల్లి, ఫిబ్రవరి 24: తెలంగాణ మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం మార్చి 2లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మునిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి (మిగిలి ఉన్న సీట్ల ) కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు

# కాలువ పూర్తయితే రెండువేల ఎకరాలకు సాగునీరు

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 24: నల్లవాగు ప్రాజెక్ట్ నుంచి ప్రతీ వర్షాకాలంలో వృధాగా వెళ్లే వరద నీటిని, నిజాంసాగర్ లోకి మళ్లిస్తే కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో అదనంగా రెండు వేల ఎకరాలు సాగులోకి వస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాసాన్‌పల్లిలో అంగన్‌వాడీ భవనం, సీసీ రహదారి ,దేవునిపల్లిలో సీసీ రహదారి నిర్మాణాలకు శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నల్లవాగు ప్రాజెక్టునుంచి ప్రతి సంవత్సరం 3, 4 టీఎంసీల వరద నీరు వృథాగా మంజీరనదిలో కలుస్తున్నదని, అదే నీటిని వరదకాలువ తవ్వి, దిగువున ఉన్న నిజాం సాగర్ ప్రాజెక్టులోకి వదిలితే కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని రెండు వేల ఎకరాలు అదనంగా సాగు అవుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో అందరికీ స్వాతంత్ర్యం వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్లు భాస్కర్ గుప్తా, గుండు నరేందర్, పాల్గొన్నారు.

# లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి



మాట్లాడుతున్న న్యాయాధికారిణి ధనలక్ష్మి

పుల్‌కల్, ఫిబ్రవరి 24: లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో ముందుకు సాగాలని జోగిపేట మున్సిఫ్ కోర్టు న్యాయాధికారిణి ధనలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని బస్వాపూర్ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులకు శనివారం మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయాధికారి ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే పాఠశాల విద్యనే అత్యంత ముఖ్యమన్నారు. ఇంటర్మీడియట్ విద్య కూడా విద్యార్థుల దిశ, దశలను మారుస్తుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు చట్టాలపై అవగాహన అత్యంత ముఖ్యమన్నారు. పోక్సో చట్టం గురించి అందరికీ అవగాహన అవసరమని, పిల్లలపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అంతకుముందు న్యాయాధికారి ధనలక్ష్మి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలను తనిఖీ చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సదస్సులో న్యాయవాది శివప్రసాద్, నర్సింలు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సీబా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి: సీఐటీయూ



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24: ఆటో డ్రైవర్లు తమ సమస్యలను పరిష్కరించుకోవడం కోసం సంఘటితంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు మాణిక్ అన్నారు. ఖేడ్‌లో శనివారం ఆటో డ్రైవర్లు సీఐటీయూ అనుబంధంగా ఆటో డ్రైవర్ల యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు సామాజిక భద్రత పథకాలు లేవన్నారు. మోటార్ వాహనాల చట్ట సవరణతో చిన్న ప్రమాదాలు జరిగినా రూ. వేల జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉండటంతో, డ్రైవర్లు వృత్తిని వీడి దుర్భరంగా జీవనం గడిపే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, స్థానిక నాయకులు బాబురావు, అరుణ్, సతీష్, మోశప్ప, శ్రీను, కాన్షీరాం, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లసంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# నర్సింగ్ ఆఫీసర్లు నిబద్ధతతో పనిచేయాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24: నర్సింగ్ ఆఫీసర్లు నిబద్ధతతో పనిచేయాలని సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నూతనంగా నియమితులైన 144 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. నర్సింగ్ ఆఫీసర్లు విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఎవరికి కేటాయించిన విభాగాల్లో వారు లోపాలు లేకుండా వైద్య సేవలు అందించాలన్నారు. విధుల పట్ల బాధ్యతగా పనిచేయాలని సూచించారు. వైద్య సేవల్లో డాక్టర్ తర్వాత నర్సింగ్ ఆఫీసరే విధులే కీలకమని తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్, డా.పద్మావతి, విభాగాధిపతులు డా.షబ్బీర్, డాక్టర్లు, హెడ్ నర్సులు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ ఉంటేనే రాణించగలం

- ఇఫ్లూ ప్రొఫెసర్ రాజారామ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24: నేటి సమకాలీన సమాజంలో ప్రతిభ ఉంటేనే రాణించగలుగుతామని సెంట్రల్ యూనివర్సిటీ ఇఫ్లూ ప్రొఫెసర్ రాజారామ్ పేర్కొన్నారు. 'రాజ్యం-సంక్షేమ పథకాలు-సంతులిత అభివృద్ధి-లక్ష్యాలు' అనే అంశంపై రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మహనీయుల, సైన్స్, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు మొదలైనవి చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.హుస్సేన్, వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి, డా. సుధాకర్, ప్రవీణ్‌కుమార్, గణపతి, సమన్వయకర్త డా. రాజాగౌడ్, మాజీ ప్రిన్సిపాల్ డా. పి.వి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## 'పెండింగ్ బిల్లులను చెల్లించాలి'

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 24: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సంగయ్య, వెంకటరామిరెడ్డి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ.. రెండేళ్లుగా జీపీఎఫ్, జీఎల్ఐ బిల్లులు చెల్లించకుండా గత సర్కార్ ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కొత్త ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి, చర్యలు తీసుకొని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో లాభాలు

- వ్యవసాయ శాఖ ఏవో ఝాన్సీ



మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి, ఫిబ్రవరి24: ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ ఏవో ఝాన్సీ అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆయిల్ ఫామ్ మొక్కలను ఏఈవో వందనతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... వేసవి కాలం కాబట్టి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలని, మొక్కలకు సరైన నీటిని అందించాలని సూచించారు. ఆయిల్ ఫామ్ మొక్కల మధ్య అంతర పంటలను సాగు చేయడానికి అవకాశం ఉందని, ఈ అంతర పంటల సాగుతో రైతులు ఆర్థికంగా లాభాలు పొందవచ్చని, ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గంజాయి స్వాధీనం.. నిందితుడి అరెస్టు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 24: సంగారెడ్డి పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో శనివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి ఓ వ్యక్తి నుంచి కిలో 600 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో శనివారం ఉదయం గంజాయి విక్రయిస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన లాబండియోసింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. రూ.21వేల విలువ గల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని స్టేషన్‌కు తరలించారు. తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ అనిల్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు అలీమ్, విఠల్, కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, సతీష్‌మోహన్, రామారావు, కలీం తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

టేక్మాల్, ఫిబ్రవరి 24: కరెంట్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని సంగ్యాతాండాలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన పడిత్య హన్యి దంపతుల రెండవ కుమారుడు కాట్రోత్ నరేష్(23) శనివారం గ్రామ పంచాయతీలోని స్తంభాలకు విద్యుత్‌దీపాలు పెడుతున్నాడు. విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి స్తంభంపై నుంచి కింద పడడంతో బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. ఈ మేరకు ఏఎస్ఐ తుక్కయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- నాలుగు బైకులు స్వాధీనం

తూప్రాన్, ఫిబ్రవరి 24: బైక్‌ల చోరీలకు పాల్పడిన నిందితుడిని శనివారం అరెస్టు చేశారు. నిందితుడు చోరీ చేసిన నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన తూప్రాన్ మండలంలో చోటుచేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. రామాయంపేట మండల కేంద్రానికి చెందిన కోలల ప్రకాష్ (26) తూప్రాన్ మండలంలో బైక్‌ల చోరీలకు పాల్పడినట్లు ఎస్ఐ వివరించారు. తూప్రాన్ పట్టణంలో మూడు బైక్‌లు, ఇస్లాంపూర్ రామప్పగుట్ట వద్ద మరో బైక్‌ను చోరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడు కోలల ప్రకాష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 : జిల్లా విద్యాశాఖ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం, జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సంయుక్తంగా నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్-2024లో రాష్ట్రస్థాయిలో సంగారెడ్డి జిల్లా మూడవ స్థానంలో నిలిచింది. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రం నుంచి శనివారం ఆన్‌లైన్‌లో టెస్ట్ నిర్వహించగా, మొదటి మూడు స్థానాలలో వచ్చిన ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. 50 మార్కులకుగాను 44 మార్కులు సాధించి నౌసిన్, భవాని, నిజాముద్దీన్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లాకు మూడవ స్థానం దక్కడంతో విద్యార్థులను డీఈవో వెంకటేశ్వర్లు అభినందించారు.

## బహుజన విద్యార్థి జేఏసీ జిల్లా ఇన్‌చార్జిగా పవన్ కళ్యాణ్



హత్నూర, ఫిబ్రవరి 24: బహుజన విద్యార్థి జేఏసీ సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా బోర్పట్ల గ్రామానికి చెందిన కొప్పు పవన్ కళ్యాణ్ నియామకమయ్యారు. గత కొన్ని ఏళ్లుగా విద్యార్థి సంఘాలలో పని చేస్తూ, బహుజన విద్యార్థుల చైతన్య కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని రాష్ట్ర సభ్యులు గుర్తించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జిగా నియామకమైన పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తూ వాటి పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## యువతను ఉత్తమ పౌరులుగా తయారు చేయండి

- జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్, ఫిబ్రవరి 24: యువతను సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారుచేయాల్సిన బాధ్యత అధ్యాపకులదేనని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆచార్య కళాశాలకు సంబంధించిన 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను పోటీపరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నతమైన హోదాల్లో ఉంటారన్నారు. అధ్యాపకులు విద్యార్థులను భవిష్యత్తులో ఉన్నతమైన హోదాల్లో ఉండేలా, అందరిని గౌరవించేలా ప్రోత్సహించాలని అధ్యాపకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.